సాక్షి
పార్వతీపురం మన్యం
శనివారం । 13 । జూలై । 2024



అక్రమ వ్యాపారానికి చెక్

ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ఎటువంటి లైసెన్సు లేకుండా ఆహార పదార్థాలు విక్రయించే వారిపై కఠిన చర్యలకు రంగం సిద్ధమైంది. - 8లో



ఈఎస్ఐ ఆస్పత్రిలో అరకొర వైద్య సేవలు

ఈఎస్ఐ డిస్పెన్సరీ, డయోగ్నోస్టిక్ సెంటర్‌లో కార్మికులకు అరకొర వైద్య సేవలు అందుతున్నాయి. - 8లో



జ్వరమొస్తే పరుగులు తీయాల్సిందేనా...

ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు జ్వరం వస్తే ప్రధానోపాధ్యాయులే దిక్కవుతున్నారని విద్యార్థులు వాపోతున్నారు. - 8లో

అభివృద్ధే అభిమతం

- ఉమ్మడి విజయనగరం జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం
- ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ప్రకారం గౌరవం ఇవ్వాలి
- ఎన్నడూలేని కక్ష సాధింపు చర్యలు, దాడులు సరికాదు
- ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి
- అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలి
- జొన్నాడ టోల్‌గేట్ తరలించేలా కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలి
- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- సమస్యల పరిష్కారానికి మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణి సానుకూల స్పందన



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కె.శ్రీనివాసరావు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పాల్గొన్న మంత్రి సంధ్యారాణి, కలెక్టర్లు శ్యామ్‌ప్రసాద్, అంబేద్కర్

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఉమ్మడి విజయనగరం జిల్లా అభివృద్ధే అభిమతంగా ప్రజాప్రతినిధులందరకూ సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కోరారు. పార్టీల మధ్య రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితమని, ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన తర్వాత ప్రజలందర్నీ సమానంగా చూడటం మన బాధ్యతని అన్నారు. దీనికి రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్, రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సానుకూలంగా స్పందించారు. ప్రశాంతంగా ఉండే ఈ ప్రాంతంలో కక్షలకు, దాడులకు ఆస్కారం ఇవ్వకూడదని ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ ప్రస్తావించారు. ఎన్నడూ లేనివిధంగా ఇలాంటి సంఘటనలు, ముఖ్యంగా ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం చోటు చేసుకుంటున్నాయని, ఇది దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులను గుర్తించి అధికారులు కఠిన చర్యలను తీసుకోవాలని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేసిందని, ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం కూడా ఆ సంప్రదాయాన్ని కొనసాగించాలని స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులని సంక్షేమ పథకాలను దూరం చేయవద్దని, అనర్హులైతే తప్ప తొలగించవద్దని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ కచ్చితంగా పాటించాలని, అనధికార వ్యక్తుల చొరబాటును నిరోధించాలని కోరారు. దీనికి విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్లు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, శ్యామ్‌ప్రసాద్ సానుకూలంగా స్పందించారు.

హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం విజయనగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో జరిగింది. సార్వత్రిక ఎన్నికల తర్వాత తొలిసారిగా నిర్వహించిన సమావేశానికి ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. తొలుత తాజాగా ఎన్నికైన మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణి, ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, శెట్టి తనూజారాణి, ఎమ్మెల్యేలు లోకం మాధవి, పూసపాటి అదితి గజపతిరాజు, తోయక జగదీశ్వరి, బోనెల విజయచంద్రలను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సాదరంగా ఆహ్వానించారు. సమావేశానికి ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సూర్యనారాయణరాజు (సురేష్ బాబు), ఎంపీపీలు, జెడ్పీటీసీలు హాజరయ్యారు. శృంగవరపు కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు, రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన గైర్హాజరయ్యారు. సమావేశంలో పలు అంశాలను, సమస్యలను సభ్యులు చర్చించారు. వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని, అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేయాలని జెడ్పీ చైర్మన్, మంత్రులు అధికారులకు సూచించారు.

జిల్లా ముఖచిత్రం మారుతోంది...

భోగాపురం వద్ద తలపెట్టిన అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ నిర్మాణ పనులు 34 శాతం ఇప్పటికే పూర్తయ్యాయని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మిగతా నిర్మాణ పనులనూ నిర్దీత గడువులోకి పూర్తి అయి విమానాశ్రయం అందుబాటులోకి వస్తే విజయనగరం జిల్లా ముఖచిత్రం మారుతుందని, ప్రపంచపటంలో చోటు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తారకరామతీర్థసాగర్ ప్రాజెక్టును పూర్తిచేసి విమానాశ్రయానికి అవసరమైన నీటిని అందించాల్సి ఉందన్నారు. ఇది పూర్తయితే నెల్లిమర్ల నియోజకవర్గంలో సాగునీరు, జిల్లా కేంద్రమైన విజయనగరంలో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. సాలూరు నియోజకవర్గంలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణ పనులను సత్వరమే ప్రారంభించాలన్నారు.

జిల్లా స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని మంత్రులను కోరారు. గతంలో మాదిరిగానే ఎంఎల్‌ఏలను ఆయా నియోజకవర్గాల స్థాయి సంఘాల సభ్యులుగా నియమిస్తున్నట్లు చెప్పారు.

పింఛన్ల పంపిణీపై చర్చ...

మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ, అనర్హులకు కూడా వితంతు పింఛన్లు అందుతున్నాయని చెప్పారు. పింఛన్ల పరిశీలనకు త్వరలో ఒక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, వైద్యారోగ్య పింఛన్ల విషయంలో దృష్టి పెట్టాల్సి ఉందన్నారు. అర్హులందరికీ పింఛన్లు అందించేలా చూడాలని, అనర్హులను తొలగించాలని సూచించారు.

విధ్వంసాన్ని సహించం...

ప్రభుత్వ ఆస్తుల విధ్వంసాన్ని ఎట్టి పరిస్థితిలోనూ సహించేది లేదని మంత్రులు సంధ్యారాణి, శ్రీనివాస్ స్పష్టం చేశారు. వెలుగులో వీఏఓల తొలగింపుపై విచారణ చేయాలని శ్రీనివాస్ ఆదేశించారు. జొన్నాడ వద్ద ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌ను అక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలించాలని తీర్మానం చేయడంతో సభ ముగిసింది. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా, డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన గౌరవ సభ్యులు, అధికారులు

సాగునీటి ప్రాజెక్టుల ప్రస్తావన...

సాగునీటి కాలువలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవడానికి దృష్టి సారించాలని మంత్రి కొండపల్లి అధికారులను ఆదేశించారు. ఉపాధిహామీ పథకం ద్వారా పంట కాలువల్లో పిచ్చిమొక్కలు, పూడికను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాజెక్టుల పరిస్థితిని నార్త్‌కోస్టల్ సీఈ ఎస్.సుగుణాకరరావు వివరించారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ తోటపల్లి కాలువల ద్వారా శివారు భూములకు కూడా సాగునీరు అందించాలని కోరారు. విజయనగరం ఎమ్మెల్యే అదితి మాట్లాడుతూ ప్రతిపాదించిన కొత్త పనుల వివరాలను అందించాలని కోరారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే నాగమాధవి మాట్లాడుతూ ఇసుక అక్రమంగా తరలించి చంపావతి నదిని చంపేశారని అన్నారు. లేఅవుట్ల కారణంగా చెరువులకు వెళ్లే కాలువలు మూసుకుపోయాయని చెప్పారు. కలెక్టర్ అంబేద్కర్ స్పందిస్తూ లేఅవుట్లపై రెవెన్యూ సిబ్బందితో సర్వే చేయించి, అక్రమణలను తొలగించేందుకు కృషి చేస్తామన్నారు. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ వరహాలగెడ్డ ఆక్రమణలపై అధికారులను నిలదీశారు. జంఝావతి హై లెవెల్ కెనాల్ ఎందుకు ఆగిందని ప్రశ్నించారు. దీనికి జెడ్పీ చైర్మన్ స్పందిస్తూ జంఝావతి అంతర్ రాష్ట్ర సమస్య అని, ఇరు రాష్ట్రాలు సమష్టిగా పరిష్కరించాల్సి ఉందన్నారు.

వ్యవసాయంపై ఆసక్తికర చర్చ...

రైతుల అభీష్టం మేరకు వారికి కావాల్సిన విత్తనాలను వ్యవసాయ శాఖ అధికారులు సరఫరా చేయాలని మంత్రి గుమ్మడి సంధ్యారాణి సూచించారు. పంట నష్టపరిహారం రైతులకు సక్రమంగా అందలేదని, ఆ వివరాలు ఇవ్వాల ని ఆదేశించారు. కల్తీ విత్తనాలు, నకిలీ ఎరువు లు రాకుండా చూడాలన్నారు. గిరిశిఖర గ్రామాలకు సైతం విత్తనాలు అందించాలని చెప్పారు. మంత్రి కొండపల్లి మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో ఏయే విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్న పూర్తి సమాచారాన్ని రైతులకు అందించాలని అధికారులను ఆదేశించారు. విజ యనగరం జిల్లా కలెక్టరు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్పందిస్తూ కల్తీ ఎరువులు, నాసిరకం విత్తనాలను అడ్డుకునేందుకు షాపులపై దాడులు చేయిస్తున్నామని చెప్పారు. కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి మాట్లాడుతూ కల్తీ విత్తనాలను అరికట్టాలని సూచించారు. ఆయిల్ ఇంజన్లు, స్ప్రింక్లర్లు తదితర వ్యవసాయ పరికరాలను 90 శాతం సబ్సిడీపై అందించాలని సభ తీర్మానం చేసింది.

వ్యాధుల నియంత్రణకు చర్యలు

సీజనల్ వ్యాధులను అరికట్టడానికి అన్నిరకాల చర్యలు తీసుకోవాలని మంత్రులిద్దరూ రెండు జిల్లాల వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మలేరియా, బోదకాలు వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో పారిశుద్ధ్య వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు మంత్రి సంధ్యారాణి తెలిపారు. జిల్లా సర్వజన ఆస్పత్రి, ఘోష ఆస్పత్రి సమస్యలను ఎమ్మెల్యే అదితి ప్రస్తావించారు. కలెక్టర్ అంబేద్కర్ స్పందిస్తూ, జిల్లా సర్వజన ఆస్పత్రి వైద్య కళాశాలగా మార్పు చెందడంతో ఎన్‌హెచ్‌ఆర్‌ఎం పథకంలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందిని వేరే ఆస్పత్రులకు తరలించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అయినప్పటికీ ఇక్కడ డాక్టర్లు, సిబ్బంది తగ్గకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అరకు ఎంపీ డాక్టర్ తనూజారాణి మాట్లాడుతూ, వర్షాకాలంలో గిరి శిఖర గ్రామాల్లో జ్వరాలు విజృంభించే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతల మరణాలను ఆపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ, ఇటీవల గుర్ల మండలంలో పీహెచ్‌సీకి వైద్యులు సకాలంలో రాకపోవడంతో ఒకరు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పూసపాటిరేగ మండలం కనిమెట్ట గ్రామంలో విజృంభించిన వ్యాధుల గురించి ప్రస్తావించారు. వైద్యులు సకాలంలో సక్రమంగా సేవలను అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రులకు ప్రహరీలు లేవని, మోపాడ ఆసుపత్రిలో ఆక్రమణలను తొలగించాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి కోరారు. వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అంబేద్కర్ ఆదేశించారు.

న్యూస్‌రీల్

గురుకులాల్లో మిగులు సీట్లకు కౌన్సెలింగ్

సీతంపేట: గిరిజన గురుకుల విద్యాసంస్థల్లో మిగులు సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భామిని, మెళియాపుట్టి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో 6 నుంచి 8 తరగతుల్లో మిగులు సీట్లకు ఈనెల 19న భామిని ఈఎంఆర్‌ఎస్‌లో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. గతంలో ప్రవేశపరీక్షకు హాజరైన వారు మాత్రమే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. ఈఎంఆర్‌ఎస్ ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో 51 సీట్లకు ఈనెల 18న కౌన్సెలింగ్ జరుగుతుందని చెప్పారు. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు.

20న గురుకుల కళాశాలల్లో...

స్థానిక బాలురు, బాలికల గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న 37 సీట్లకు ఈ నెల 20న స్థానిక బాలుర జూనియర్ కళాశాలలో కౌన్సెలింగ్ ఉంటుందని పీఓ తెలిపారు. బాలికల కళాశాలలో హెచ్‌ఈసీ ఒకటి, ఒకేషనల్ ఏఅండ్‌టీలో 5 ఖాళీలు మాత్రమే ఉన్నాయన్నారు. బాలుర కళాశాలలో ఎంపీసీ-9, బైపీసీ-9, హెచ్‌ఈసీ-7, ఏఅండ్‌టీ-3, సీజీఏలో 3 ఖాళీలున్నాయన్నారు. పదోతరగతి మార్కుల ఆధారంగా సీట్లు భర్తీచేస్తామన్నారు.

నేడు తోటపల్లి పాత ఆయకట్టుకు నీరు విడుదల



తోటపల్లి జలాశయం

గరుగుబిల్లి: తోటపల్లి జలాశయం పరిధిలో ఉన్న పాత ఆయకట్టుకు శనివారం సాగునీరు విడుదల చేస్తామని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కురుపాం, పాలకొండ, రాజాం ఎమ్మెల్యేలు తోయక జగదీశ్వరి, నిమ్మక జయకృష్ణ, కె.మురళీమోహన్ పాల్గొంటారన్నారు. కుడి, ఎడమ కాలువల పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని 64వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అక్రమ మద్యం అమ్మకాలపై ఉక్కుపాదం


- డీఎస్పీ కృష్ణారావు



పారబోసేందుకు సిద్ధంగా ఉంచిన సారా, మద్యం బాటిళ్ల వివరాలను పరిశీలిస్తున్న డీఎస్పీ కృష్ణారావు, పక్కనే ఉన్న ఫక్రుద్దీన్

వీరఘట్టం: అక్రమ మద్యం అమ్మకాలపై ఉక్కుపాదం తప్పదని పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ షేక్ ఫక్రుద్దీన్, పోలీస్ సిబ్బందితో ఆయన శుక్రవారం మాట్లాడారు. బెల్టు షాపులు, సారా అమ్మకాలు, తయారీపై నిఘా పెంచాలని సూచించారు. ఇటీవల పోలీసులు చేపట్టిన దాడుల్లో 27 కేసుల్లో పట్టుబడిన 354 లీటర్ల సారాను, ఆరు కేసుల్లో పట్టుబడిన 23.4 లీటర్ల మద్యం బాటిళ్లను యు.వెంకమ్మపేట వద్ద ధ్వంసం చేశారు.

ఎన్ఎంఎంఎస్ దరఖాస్తులను సమర్పించండి



జి.పగడాలమ్మ, డీఈఓ

పార్వతీపురంటౌన్: గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన జాతీయ ఉపకార వేతన పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు ఆగస్టు 31వ తేదీలోగా స్కాలర్‌షిప్.జీఓవీ.ఇన్‌లో తమ దరఖాస్తును సమర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు. 2020, 2021, 2022 సంవత్సరాల్లో ఎంపికైన విద్యార్థులు తప్పకుండా ఈ సంవత్సరం రెన్యువల్ చేసుకోవాలన్నారు. ఈ సంవత్సరం ప్రతి విద్యార్థి వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ (ఓటీఆర్) చేసుకుని, వెంటనే తమ అప్లికేషన్‌ను సబ్‌మిట్ చేయాల్సి ఉంటుందన్నారు. మెరిట్ లిస్ట్‌లో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరులో ఏమైనా తప్పుగా ఉంటే వెంటనే సంబంధిత స్కూల్ ద్వారా సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఆధార్ మిస్‌మ్యాచ్ వివరాలను సమర్పించాలన్నారు. ప్రతి విద్యార్థి తన ఆధార్ నంబర్‌ను బ్యాంక్ ఖాతాకు సీడ్ చేయించుకొని డీబీటీ ద్వారా డబ్బులు జమయ్యేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు.

పక్షోత్సవాలు.. ఆచరణలో చూపితేనే మేలు!

- ఈ నెల 16 నుంచి పారిశుద్ధ్య పక్షోత్సవాల నిర్వహణ
- గ్రామాల్లో రోజుకొక కార్యక్రమం చేపట్టేందుకు చర్యలు



కాలువల్లో చెత్త తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

సాక్షి, పార్వతీపురం మన్యం: ప్రస్తుతం జిల్లాలో వ్యాధులు విజృంభిస్తున్నాయి. డయేరియా రోగులు, మలేరియా జ్వర పీడితులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. వైద్యశాలల్లో సరిపడా పడకలు, మందులు లేక రోగుల అవస్థలు వర్ణనాతీతం. గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నప్పటికీ.. తూతూమంత్రంగానే సాగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఈ నెల 16 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. పారిశుద్ధ్య నిర్వహణతో పాటు.. రోజుకొక కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవగాహన చేపట్టాలని నిర్ణయించింది. 16న మండల స్థాయిలో ప్రజాప్రతినిధులతో పారిశుద్ధ్య నిర్వహణ ప్రారంభోత్సవం, ఇంటింటికీ కరపత్రాల పంపిణీ చేపడతారు. 18న అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులను చైతన్యం చేయడం, గ్రామ పంచాయతీల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఉపాధి హామీ పథకం సంఘ సభ్యులకు అవగాహన కల్పిస్తారు. 19న డ్రై డేగా పాటిస్తూ.. గ్రామ పంచాయతీ కార్యాలయ సిబ్బందితో చెత్తకుప్పలు, మురుగు నీటి నిల్వలు, పైప్ లైన్ లీకేజీలో ఉన్న ప్రదేశాల గుర్తింపు.. అవసరం మేరకు చెత్త కుప్పలు తొలగించడం చేపడతారు. 20న శానిటేషన్ అవేర్‌నెస్ డే పాటిస్తారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కోరుతారు. 21న గ్రామాల్లో మురుగునీటి నిల్వలను, గుంతలను పూడ్చి.. పూడికతీత పనులు చేపడతారు. మురుగునీరు సాఫీగా వెళ్లేలా తగు చర్యలు తీసుకుంటారు. 23న వైద్య సిబ్బంది సహకారంతో నాణ్యమైన క్రిమిసంహారక మందులు స్ప్రే చేస్తారు. 24న గ్రామ పంచాయతీ పరిధిలో చేతిపంపులు, నీటి కుళాయిల వద్ద మురుగు నీరు నిల్వ లేకుండా చూడటంతోపాటు.. మరమ్మతుల నిర్వహణ, 25న వైద్య సిబ్బంది సహకారంతో నాణ్యమైన మలాథియాన్ వంటి క్రిమిసంహారక మందులు స్ప్రేచేయడం.. 26న కుళాయిలు, చేతి పంపుల వద్ద మురుగు నీరు నిల్వ లేకుండా చూడటంతో పాటు వాటి వద్ద ఇంకుడు కుంతలు ఏర్పాటు చేస్తారు. 27న అన్ని గ్రామాల్లో ఫాగింగ్ యంత్రాలతో దోమల నివారణ చర్యలు, 28న రహదారులపై మురుగునీరు ప్రవాహాన్ని అరికట్టడం.. ఆయా ఇంటి యజమానుల ద్వారా ట్యాంకులను శుభ్రపరచడం నిర్వహిస్తారు. 31వ తేదీన పందుల పెంపక యజమానులతో చర్చించి.. నివాస ప్రాంతాలకు మూడు కిలోమీటర్ల దూరంలో పెంపకం సాగేలా చర్యలు తీసుకుంటారు. వచ్చే నెల 1న గామంలో ఉన్న పాడి గేదెల నుంచి పేడ సేకరణ, ఎరువుతో వర్మీ కంపోస్ట్ ఉత్పత్తి.. గ్రామంలో ఉన్న ఉద్యాన రైతులతో సమావేశమై తయారైన ఎరువులు కొనుగోలు కోసం ఒప్పందం కుదుర్చుకోవడం, 2వ తేదీన డ్రైడే పాటించడంతో పాటు.. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చేపడతారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా పంచాయతీ పరిశుభ్రత పత్రాలను ఆయా మండల ప్రత్యేకాధికారుల ద్వారా పంచాయతీలకు అందజేస్తామని డీపీఓ బలివాడ సత్యనారాయణ తెలిపారు.

తూతూమంత్రంగా సాగితే ప్రయోజనం శూన్యం

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 450 వరకు గ్రామ పంచాయతీలున్నాయి. ఇటీవల ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, కాలువలు శుభ్రం చేస్తున్నా పూర్తిస్థాయిలో సాగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు వర్షాల సీజన్ కావడంతో ఏజెన్సీ ప్రాంతంలో వ్యాధులు విజృంభిస్తున్నాయి. మలేరియా, డయేరియా రోగులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. దోమలవ్యాప్తి విపరీతంగా పెరిగిందని ప్రజలు వాపోతున్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు తూతూమంత్రంగా కాక.. చిత్తశుద్ధితో చేపట్టాలని కోరుతున్నారు.

ఒక్కరికే ఇస్తారా?.. విద్యార్థులందరికీ ఇస్తారా?

- ఎంతమంది ఉంటే అంతమందికీ ఇస్తామని ఎన్నికల ముందు ఊదరగొట్టారుగా..
- 'తల్లికి వందనం'పై స్పష్టత ఇవ్వండి
- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న పీడిక రాజన్నదొర

సాలూరు:

ఎన్నికల సమయంలో కూటమి నాయకులు తల్లికి వందనం పథకం కింద పేద కుటుంబాల విద్యార్థులందరికీ రూ.15వేలు చొప్పున ఇస్తామన్న హామీపై స్పష్టత ఇవ్వాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారని, ప్రభుత్వ పెద్దలు సమాధానం చెప్పాలని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర కోరారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులోని ఆయన స్వగృహంలో విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. టీడీపీ, బీజేజీ, జనసేన కూటమి సూపర్‌సిక్స్‌లో పొందుపరిచిన తల్లికి వందనం పథకంపై విస్తృత ప్రచారం చేశారని, చంద్రబాబునాయుడు, నారా లోకేశ్‌తో పాటు రాష్ట్ర స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు కూటమి నాయకులు సమావేశాల్లోను, ఇంటింటికీ వెళ్లి ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని తెలిపారన్నారు. ఇద్దరుంటే రూ.30వేలు, ముగ్గురుంటే రూ.45వేలు.. ఇలా ఎంతమంది ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్నా రూ.15వేలు చొప్పున ఇస్తామని ఊదరగొట్టారన్నారు. తాజాగా తల్లికి రూ.15వేలు చొప్పున ప్రభుత్వం జీఓ-29ను ఆంగ్లంలో విడుదల చేసిందన్నారు. మేమంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నామని, అందులో విషయాలను పూర్తిగా అవగాహన చేసుకోలేమని, విదేశాల్లో చదివిన నారా లోకేశ్ ఆ జీవోను చదివి, వారు ఎన్నికల ముందు చెప్పిన తల్లికి వందనం పథకం అంశాలు యథావిధిగా ఉన్నాయోలేదో చెప్పాలన్నారు. ఒకే ఇంటిలోని ఇద్దరు ముగ్గురు పిల్లలు చదువుతున్నా కేవలం తల్లికి రూ.15 వేలే ఇస్తే దానిని వాటాలుగా భావించుకోవాలా అని ప్రశ్నించారు. ముగ్గురు పిల్లలుంటే ఒక్కొక్కరికి రూ.5 వేలు, ఇద్దరు పిల్లలుంటే రూ.7,500, నలుగురుంటే రూ.3,500 చొప్పున సర్దుకోవాలా? అని తల్లిదండ్రులు అడుగుతున్న ప్రశ్నకు హామీ ఇచ్చిన పెద్దలే సమాధానం చెప్పాలన్నారు. తల్లికి వందనం పేరిట ఎన్నికల్లో ఇచ్చిన హామీని చిత్తశుద్ధితో అమలుచేసి పేద కుటుంబాల పిల్లల చదువుకు ఆర్థిక కష్టాలు దూరం చేయాలని కోరారు. తను చెగువెరా వారసుడునని, ప్రశ్నించడానికే వచ్చానని తెలిపే ప్రస్తుత ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దీనిపై స్పందించి, మేనిఫెస్టోలో పొందుపరిచినట్లుగా ప్రతి విద్యార్థికి రూ.15వేలు అందించి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని సూచించారు.

మల్లి గురుకులంలో దాహం కేకలు

- నీటిని తీసుకెళ్లి అందజేస్తున్న తల్లిదండ్రులు



తమ పిల్లలకు క్యాన్‌లతో మంచినీరు తీసుకుని స్కూల్‌కు వెళ్తున్న తల్లిదండ్రులు

సీతంపేట: మల్లి గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పీవీటీజీ (పర్టికులర్లీ వాలనర్‌బుల్ ట్రైబ్ గ్రూప్) పాఠశాల విద్యార్థులు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. చివరకు తల్లిదండ్రులే తమ పిల్లలకు తాగునీటిని తీసుకెళ్లి అందించాల్సిన పరిస్థితి. ఇక్కడ మూడు నుంచి పదో తరగతి వరకు 610 మంది విద్యార్థులు చదువుతున్నారు. భామిని ఈఎంఆర్‌ఎస్‌కు చెందిన విద్యార్థులు అక్కడ భవన నిర్మాణాలు పూర్తికాకపోవడంతో 6 నుంచి 9 తరగతుల వరకు 100 మంది ఇక్కడే చదువుతున్నారు. మొత్తం 710 మందికి కేవలం రెండు బోర్లు మాత్రమే ఉండడంతో ఇబ్బందులు తప్పడంలేదు. స్నానాలకు, దుస్తులు ఉతకడానికి, తాగడానికి నీరు సరిపోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. దీనికి తోడు ఈ సంవత్సరం వర్షాలు కూడా సరిగా కురవకపోవడంతో భూగర్భ జలాలు తగ్గి బోర్ల నుంచి నీరు సమృద్ధిగా రావడం లేదన్నారు. ఇదే విషయాన్ని ప్రిన్సిపాల్ వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా ప్రస్తుతానికి ఉన్న నీటిని విద్యార్థులు వినియోగిస్తున్నారన్నారు. పాఠశాలలో మంచినీటి కొరత విషయమై ఉన్నతాధికారులకు తెలియజేశామని తెలిపారు. ఈ నెలాఖరుకు ఈఎంఆర్ఎస్ విద్యార్థులు వారి పాఠశాలకు వెళ్లిపోతే కొంత సమస్య తీరుతుందన్నారు.

క్లుప్తంగా

ఎలక్ట్రికల్ దుకాణంలో చోరీ

శృంగవరపుకోట: పట్టణంలో వరుస చోరీలతో దొంగలు హడలెత్తిస్తున్నారు. ఇటీవల పట్టణంలో పూర్తిగా పోలీస్ పెట్రోలింగ్ కరువైంది. సుమారు మూడు నెలల పాటూ ఎన్నికల హడావిడిలో పడి పోలీస్ యంత్రాంగం పెట్రోలింగ్, ట్రాఫికింగ్ అంశాలపై దృష్టి సారించటం మానేశారు. దీంతో పట్టణంలో దొంగల బెడద ఎక్కువైంది. గురువారం రాత్రి విశాఖ – అరుకు ప్రధాన రహదారిలో పోలీస్ స్టేషన్‌కు పొరుగున ఉన్న శ్రీవాణి ఎలక్ట్రికల్ మోటార్ రీవైండింగ్ వర్క్స్ దుకాణం తలుపు విరగ్గొట్టి దొంగలు చోరీకి పాల్పడ్డారు. రిపేరింగ్ మెటీరియల్, వస్తువులు దోచుకుపోయారు. సుమారు రూ.2లక్షల విలువైన సామగ్రి దోచుకుపోయారని షాపు యజమాని గుడే రమణ వాపోయాడు.

వాహనాలపై కేసుల నమోదు

పార్వతీపురం టౌన్: జిల్లాలో పది వాహనాలపై కేసులు నమోదు చేసామని జిల్లా రవాణా శాఖాధికారి శశికుమార్ అన్నారు. ఆర్టీసీ, జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టామన్నారు. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రమాదాలకు కారణం ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళ్లడం కారణమని గుర్తించామన్నారు. జిల్లాలో నిర్వహించిన తనిఖీల్లో 10 ఆటోలపై కేసులు నమోదు చేసి రూ.7వేలు అపరాధ రుసుం వసూలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం కనకదుర్గ, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయాల పాలైన ఈశ్వరరావు

బొబ్బిలి: పట్టణంలోని రైల్వే స్టేషన్ జంక్షన్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని దిబ్బగుడివలసకు చెందిన అరసాడ ఈశ్వరరావు పని మీద పట్టణానికి వచ్చాడు. రైల్వేస్టేషన్ జంక్షన్ వద్ద గల డివైడర్‌ను ఢీకొనడంతో కిందపడి తలకు గాయమై తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే స్థానికులు సపర్యలు చేసి సీహెచ్‌సీకి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేయలేదని, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ జి.లోవరాజు తెలిపారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అప్పలనాయుడు

పార్వతీపురం టౌన్: ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలైన సంఘటన కొమరాడ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. జిల్లా ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా కరక గ్రామానికి చెందిన అనిమిరెడ్డి అప్పలనాయుడు ఉపాధి హామీ పథకంలో డీఆర్‌పీగా పని చేస్తున్నాడు. కొమరాడ నుంచి గురువారం రాత్రి నడుచుకుంటూ ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్తుండగా బాలికల హాస్టల్ డౌన్ దగ్గరకు వచ్చేసరికి వెనుక నుండి వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖపట్నం తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన టూటౌన్ పరిధిలో శుక్రవారం జరిగింది. దీనికి సంబంధించి పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని కాటవీధికి చెందిన కనకల వెంకటేష్ (27) ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులు చేస్తుంటాడు. ఎప్పటిలాగే శుక్రవారం కూడా పనులు చేస్తుండగా ఒక్కసారిగా షాక్ కొట్టడంతో కుప్పకూలిపోయాడు. వెంటనే స్థానికులు స్పందించి 108 వాహనంలో కేంద్రాస్పత్రికి తరలించగా.. అప్పటికే వెంకటేష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ కోరాడ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹117	₹204	₹214

అక్రమ వ్యాపారానికి చెక్


విజయనగరంలో తోపుడుబళ్లపై ఆహార పదార్థాలు తయారు చేస్తున్న నిర్వాహకులు

- ఆహార విక్రయాలకు లైసెన్సులు తప్పనిసరి
- నిబంధనలకు విరుద్ధంగా దుకాణాల నిర్వహణ
- ఉల్లంఘనులకు రూ.5 లక్షల జరిమానా.. 6 నెలల జైలు
- చర్యలకు సిద్ధమైన అధికార యంత్రాంగం

విజయనగరం: ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ఎటువంటి లైసెన్సు లేకుండా ఆహార పదార్థాలు విక్రయించే వారిపై కఠిన చర్యలకు రంగం సిద్ధమైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎటువంటి అనుమతులు లేకుండా నిబంధనలు అతిక్రమిస్తూ వ్యాపారాలు కొనసాగించే వ్యాపారులపై జిల్లా ఆహార కల్తీ, నియంత్రణ అధికారులు కొరడా ఝుళిపించనున్నారు. ఇప్పటివరకు ఆహార పదార్థాల కల్తీపై ప్రత్యేక దృష్టి సారించిన అధికార యంత్రాంగం ప్రతి ఏడాది మాదిరిగానే లైసెన్సులు ఉన్న వారే ఆహార విక్రయాలకు అర్హులని చెబుతోంది. ఒకవేళ లైసెన్స్ లేకుండా అమ్మకాలకు పాల్పడిన వారికి రూ.5 లక్షల జరిమానాతో పాటు 6 నెలల జైలుశిక్ష విధించనున్నామని అధికారులు పేర్కొంటున్నారు.

పుట్టగొడుగుల్లా విక్రయ కేంద్రాలు

జిల్లా వ్యాప్తంగా పుట్టగొడుగుల్లా ఆహార పదార్థాల విక్రయ కేంద్రాలు వెలుస్తున్నాయి. చిన్నపాటి జంక్షన్‌లలో కూడా నాలుగైదు తోపుడు బళ్లపై ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. ఒకింత పెద్ద జంక్షన్ అయితే ఏకంగా పదుల సంఖ్యలో ఆ తరహా సెంటర్లు నిర్వహణ కనిపిస్తుండడం గమనార్హం. అంతే కాకుండా చిన్నపాటి గదులను అద్దెకు తీసుకుని మరీ పకోడి, టిఫిన్ షాపులు, నూడిల్స్, పానీపూరి అమ్మకాలు కొనసాగిస్తున్నారు. పెద్దపెద్ద రెస్టారెంట్లు, హోటళ్లు అయితే వేల సంఖ్యలోనే కనిపిస్తున్నాయి.

ఏటా లైసెన్స్ రెన్యువల్ తప్పనిసరి

ప్రభుత్వ నిబంధనల మేరకు ఏడాదిలో రూ.12 లక్షల ఆదాయం వచ్చే హోటళ్లు, రెస్టారెంట్లు రూ.2వేలు చెల్లించి తమ లైసెన్స్‌లను ఏటా రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం అధికారిక సమాచారం ప్రకారం జిల్లాలో 955 మంది లైసెన్స్‌లు పొందినట్లు తెలుస్తోంది. తద్వారా రూ.34.50 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఏడాదిలో రూ.12 లక్షలలోపు ఆదాయం సంపాదించే చిన్నపాటి దుకాణాలు నిర్వహించే వారు ఏడాదికి రూ.500 మాత్రమే చెల్లించి, లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ లెక్కన అధికారికంగా నిర్వహించే దుకాణాల కన్నా అనధికారికంగా నిర్వహించే దుకాణాలే ఎక్కువన్న విషయం స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో వాటిపై చర్యలకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

266 కేసుల నమోదు

ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతున్న అక్రమ వ్యాపారులకు వ్యతిరేకంగా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నారు. గడిచిన సంవత్సరంలో 260 కేసులు మాత్రమే నమోదు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. వీటిలో కొన్నింటిని జేసీ కోర్టుకు, మరికొన్నింటిని జిల్లా కోర్టుకు నివేదించినట్లు సమాచారం.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఆహార పదార్థాలు విక్రయించే వ్యాపారులకు లైసెన్స్ లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలకు అనారోగ్యం కలిగించేలా ఆహార పదార్థాలు కల్తీ చేసినా, అక్రమంగా అమ్మకాలు కొనసాగించినా జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తాం. – ఈశ్వరి, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, విజయనగరం జిల్లా

పర్యాటక పనులు సకాలంలో పూర్తి చేయాలి


ఆడలిలో సూచనలిస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ విష్ణుచరణ్

సీతంపేట: పర్యాటక పనులు సకాలంలో పూర్తి చేయాలని సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ విష్ణు చరణ్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక ఐటీడీఏకు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరం, గిరిజన సంక్షేమ శాఖ, ఇంజినీరింగ్, హార్టీకల్చర్, ఆర్ఓఎఫ్ఆర్, వెలుగు తదితర కార్యాలయాలను పరిశీలించారు. ఎవరెవరు ఏఏ కేడర్‌లలో పని చేస్తున్నారో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆడలి వ్యూ పాయింట్‌ను సందర్శించారు. పనులు నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందికి సూచించారు. అలాగే సుందరయ్యగూడలో నిర్మిస్తున్న గోకులాన్ని పరిశీలించారు. ట్రైబుల్ మ్యూజియం నిర్మాణ పనులు ఏ మేరకు చేశారో చూశారు. తురాయిపువలస నర్సరీ యూనిట్‌ను సందర్శించారు. అక్కడ ఏఏ మొక్కలు రైతులకు విక్రయిస్తున్నారు, ఎంత విస్తీర్ణంలో ఫారం ఉందో తెలుసుకున్నారు. ఐటీడీఏ ఇండోర్ స్టేడియం, జిమ్‌లను పరిశీలించారు. ఆయన వెంట ఏపీఓ చిన్నబాబు, ఈఈ సింహాచలం, డీఈ కృష్ణకుమార్, గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర, ఏటీడబ్ల్యూఓ మంగవేణి, డీడీఈఓ నారాయుడు, ఏఎంఓ కోటిబాబు, సీఎంఓ చిరంజీవులు తదితరులు ఉన్నారు.

తూకంలో తేడా వస్తే ఫిర్యాదు చేయండి

- జిల్లా అగ్రి టేడ్, మార్కెటింగ్ ఆఫీసర్

సాక్షి ఎఫెక్ట్...

విజయనగరం ఫోర్ట్: కంది పప్పు తూకంలో తేడా వస్తే ఫిర్యాదు చేయాలని జిల్లా అగ్రిటేడ్ మార్కెటింగ్ ఆఫీసర్ ఏడీ రవికిరణ్ సూచించారు. దాసన్నపేట రైతుబజారులో కంది పప్పు తూకంలో తేడా ఉన్న అంశంపై సాక్షిలో శుక్రవారం కేజీకి 920 గ్రాములేనట శీర్షికన ప్రచురించిన కథనానికి స్పందించారు. రైతు బజారులో ఒక ప్యాకెట్ తూకంలో కంది పప్పు తక్కువగా ఉంటే వెంటనే సరి చేసుకున్నామని తెలిపారు. ఏ రైతు బజారులోనైనా కంది పప్పు తక్కువగా తూకం వేసి ఇచ్చినట్టు అయితే తమకు ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా తూనికలు, కొలతలు శాఖ అధికారులు కూడా కందిపప్పు తూకాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసారని తెలిపారు.


దాసన్నపేట రైతుబజారులో కందిపప్పు ప్యాకెట్లు తూకం వేస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

రామతీర్థంలో వైభవంగా సహస్ర దీపాలంకరణ


సీతారామస్వామికి దీపారాధన సేవ జరిపిస్తున్న అర్చక స్వాములు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన పూజలు నిర్వహించిన తరువాత యాగశాలలో నిత్య హోమాలు, వెండి మండపం వద్ద స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. సాయంత్రం 6 గంటలకు సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా దీపారాధన మండపంపైకి తీసుకువచ్చి ప్రత్యేక ఊయలలో ఆశీనులు చేశారు. అనంతరం దీపాలు వెలిగించి ఊంజల్ సేవ జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు సాయి రామాచార్యులు, కిరణ్, రామ గోపాల్, భక్తులు పాల్గొన్నారు.

జ్వరమొస్తే పరుగులు తీయాల్సిందేనా...


జ్వరంతో బాధపడుతున్న ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

పార్వతీపురం టౌన్: ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు జ్వరం వస్తే ప్రధానోపాధ్యాయులే దిక్కవుతున్నారని విద్యార్థులు వాపోతున్నారు. ఐటీడీఏ కార్యాలయానికి, కలెక్టర్ కార్యాలయానికి 600 మీటర్లు దూరంలో చాకలి బెలగాంలో ఉన్న గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో పి.సందీప్, కె.మనోజ్ కుమార్, కె.సురేష్, సిహెచ్.నవీన్ జ్వరంతో బాధపడుతున్నారు. ఈ సందర్భంలో గురువారం రాత్రి ఆశ్రమ పాఠశాలలో జ్వరంతో బాధపడుతున్న విద్యార్థులకు వైద్యం అందించేందుకు ఏఎన్ఎం లేకపోవడంతో ప్రధానోపాధ్యాయులే జ్వరంతో బాధపడుతున్న వారిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఐటీడీఏకి, మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి 600 మీటర్ల దూరంలో ఉన్న బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాల పరిస్థితి ఇలా ఉంటే మరి దూర ప్రాంత గిరిజన ప్రాంతాల్లో ఉన్న ఆశ్రమ పాఠశాల పరిస్థితి ఎలా ఉంటుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి హాస్టల్‌ను పరిశీలించి ప్రతి ఆశ్రమ పాఠశాలకు ఒక ఏఎన్ఎంని నియమించి విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించే విధంగా పూర్తి స్థాయిలో భరోసా కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

రవీంద్రభారతి పాఠశాల యాజమాన్యంపై చర్యలకు డిమాండ్


డీఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపున్న ఏఐఎస్ఎఫ్

పార్వతీపురం టౌన్: రవీంద్ర భారతి పాఠశాల యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్ డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని రవీంద్ర భారతి పాఠశాల యాజమాన్యం అడ్మిషన్ల పేరుతో 73 మంది విద్యార్థుల దగ్గర ఫీజులు వసూలు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందన్నారు. గడచిన వేసవి కాలంలో పాఠశాల క్యాంపెయిన్ పేరుతో కొంతమంది ఉపాధ్యాయులు పిల్లలను పాఠశాలలో చేర్పుకునే విషయంపై పలు ప్రాంతాలలో విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద అడ్మిషన్ల పేరుతో రూ.3వేల చొప్పున నర్సరీ నుంచి 8వ తరగతి వరకు వసూలు చేసారన్నారు. అకడమిక్ సంవత్సరంలో పిల్లలను జాయిన్ చేసేందుకు తల్లిదండ్రులు రవీంద్ర భారతి పాఠశాల వద్దకు వెళ్లి చూడగా పాఠశాల మూసివేసి ఆ భవనంలో వేరే పాఠశాల వెలియడంతో తల్లిదండ్రులు అవాక్కయ్యారన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని, అప్పటికి యాజమాన్యం తల్లిదండ్రులకు చెల్లించాల్సిన ఫీజులు తిరిగి ఇవ్వకుంటే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఏఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి


మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

- బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కెల్ల శ్రీనివాసరావు

విజయనగరం ఫూల్‌బాగ్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కెల్ల శ్రీనివాసరావు కోరారు. బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో బీసీ భద్రతా చట్టాన్ని అమలు చేయాలన్నారు. జిల్లాలో బీసీ భవన్ నిర్మాణానికి జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారులు కృషి చేయాలన్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు ఆదేశాల మేరకు కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేశామన్నారు. బీసీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లె సూరిబాబు, తోటపల్లి బుజ్జిబాబు, బొబ్బాది చంద్రనాయుడు, సన్యాసి రావు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రిలో అరకొర వైద్య సేవలు

- ఎక్సరే టెక్నీషియన్ లేక నిలిచిన సేవలు
- సీబీపీ పరీక్షలు చేయని వైనం
- ఈఎస్ఐ పరిధిలో 21 వేల మంది కార్మిక కుటుంబాలు


ఈఎస్ఐ డయాగ్నోస్టిక్ సెంటర్


చికిత్స కోసం వచ్చిన కార్మికులు

విజయనగరం ఫోర్ట్: ఈఎస్ఐ డిస్పెన్సరీ, డయాగ్నోస్టిక్ సెంటర్‌లో కార్మికులకు అరకొర వైద్య సేవలు అందుతున్నాయి. చికిత్స కోసం వచ్చే వారికి పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. డయాగ్నోస్టిక్ సెంటర్ పరిధిలో వేలాది మంది కార్మికులు ఉన్నారు. వీరంతా చికిత్స కోసం డయాగ్నోస్టిక్ సెంటర్‌కు వస్తారు. డయాగ్నోస్టిక్ వచ్చే వారికి పూర్తి స్థాయిలో వైద్య పరీక్షలు చేయకపోవడం వల్ల వారు ప్రైవేటు లేబొరేటరీకి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ఓపీ విభాగాలు

ఈఎస్ఐ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఎముకలు విభాగం, ఆప్తామాలజీ, గైనిక్, ఈఎన్‌టీ, పిడియాట్రిక్ ఓపీ విభాగాలు ఉన్నాయి. ఆయా ఓపీ విభాగాల్లో సేవలు పొందేందుకు కార్మిక కుటుంబ సభ్యులు వస్తారు. ఈఓపీ విభాగాలకు ప్రతి రోజు 50 నుంచి 60 మంది వరకు వస్తారు.

ఎక్సరే టెక్నీషియన్ లేక నిలిచిన సేవలు

ఏదైనా వ్యాధి నిర్ధారణ కోసం ఎక్సరే అనేది చాలా కీలకం. ఆస్పత్రిలో ఎక్సరే ప్లాంట్ ఉన్నప్పటికీ ఎక్సరే టెక్నీషియన్ లేకపోవడం వల్ల ఆ సేవలు కార్మికులకు అందడం లేదు. ఛాతిలో కఫం, ఇన్ఫెక్షన్ నిర్ధారణ కోసం, నడుం నొప్పి, మోకాళ్ల నొప్పి, ఏదైనా గాయాలు అయినప్పుడు వ్యాధి నిర్ధారణ కోసం ఎక్సరే తీస్తారు. డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ఎక్సరే పనిచేయకపోవడం వల్ల కార్మికులు ఎక్సరే బయట తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

జరగని సీబీపీ పరీక్ష

డయాగ్నోస్టిక్ సెంటర్‌లో కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (సీబీపీ) పరీక్ష జరగడం లేదు. రోగులకు చికిత్స అందించడంలో ఈ పరీక్ష చాలా ప్రధానమైనది. సీబీపీ పరీక్షలో హిమోగ్లోబిన్ ఎంత ఉంది, తెల్ల రక్తకణాలు సంఖ్య, ఎర్ర రక్త కణాలు సంఖ్య, ప్లేట్‌లెట్స్ సంఖ్య తెలుస్తుంది. వీటి ఆధారంగా రోగికి చికిత్స అందించడానికి అవకాశం ఉంటుంది. ఈ పరీక్షలు జరగడం లేదు.

21 వేల మంది కార్మికులు ఉన్నారు:

ఈఎస్ఐ డయాగ్నోస్టిక్ సెంటర్ పరిధిలో 21 వేల మంది కార్మికులు ఉన్నారు. వీరంతా ఏదైనా జబ్బు చేస్తే చికిత్స కోసం వస్తారు. ఓపీ సేవలు అవసరమైన వారికి ఇక్కడ చికిత్స అందిస్తారు. ఇన్ పేషెంట్ సేవలు అవసరమైన వారికి విశాఖలోని మల్కాపురంలో ఉన్న ఈఎస్ఐ ఆస్పత్రికి రిఫర్ చేస్తారు.

టెక్నీషియన్ లేకపోవడంతోనే...




ఎక్సరే టెక్నీషియన్ లేకపోవడం వల్ల ఎక్సరే తీయడం లేదు. ఎక్సరే టెక్నీషియన్ పోస్టు నియామకం ప్రాసెస్‌లో ఉంది. సీబీపీ రిజాన్స్ లేకపోవడం వల్ల చేయడం లేదు. రిజాన్స్ కావాలని ప్రతిపాదనలు పంపించాం.
– డాక్టర్ కృష్ణకిషోర్, సూపరింటెండెంట్, ఈఎస్ఐ డయాగ్నోస్టిక్ సెంటర్

వైద్యుడి ప్రవర్తనపై చర్యలు చేపట్టాలి

పార్వతీపురం టౌన్: జిల్లా ఆస్పత్రిలో ఫోరెన్సిక్ వైద్యుడిగా పని చేస్తున్న డా.ఎంకేవీ సంజీవ నాయుడు ప్రవర్తనపై చర్యలు చేపట్టాలని ఆస్పత్రి ఉద్యోగులు ఉద్యమబాట పట్టారు. ఈ మేరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఏఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ డా.ఎంకేవీ సంజీవనాయుడు ప్రవర్తనతో ఆస్పత్రిలో పని చేస్తున్న అందరూ తీవ్ర ఇబ్బందులు, మనోవేదనకు గురవుతున్నారన్నారు. అనవసరంగా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ, ఆస్పత్రి అఫీషియల్ వాట్సాప్ గ్రూప్‌ల్లో ఇష్టం వచ్చినట్లుగా దురుద్దేశంతో మహిళలను, ఇతర సిబ్బందిని ఉద్దేశిస్తూ తీవ్ర పదజాలాలతో నోటికి ఇష్టం వచ్చినట్లు మెసేజ్‌లు పెడుతున్నారన్నారు. ఎన్నిసార్లు ఎంతో మంది సిబ్బంది, డాక్టర్లు, మెడికల్ సూపరింటెండెంట్ వారించినా అతని ప్రవర్తనలో ఏ రకమైన మార్పు లేదన్నారు. గతంలో కూడా ఇతనిపై దర్యాప్తునకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఒక కమిటీని వేయడం జరిగిందని కానీ దీనిపై ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. డా.ఎంకేవీ సంజీవనాయుడిని ఈ ఆస్పత్రి నుండి పంపించి మా అందరికి బాధల నుండి విముక్తి కలిగించాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మృతుడు గంద్రేడి నూకరాజు(ఫైల్)

భోగాపురం: ఆగి ఉన్న లారీని మరో లారీ బలంగా ఢీకొనడంతో డ్రైవర్ గంద్రేడి నూకరాజు(36) మృతి చెందగా, క్లీనర్ ఏనుగుల రాము తీవ్ర గాయాల పాలైన సంఘటన శుక్రవారం ఉదయం సుందరపేట జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. విశాపట్నం జిల్లా సబ్బవరం గ్రామానికి చెందిన నూకరాజు డ్రైవర్‌గా, అసరపల్లి గ్రామానికి చెందిన ఏనుగుల రాము క్లీనర్‌గా విధులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరూ లారీలో బిస్కెట్ ప్యాకెట్లను లోడు చేసుకుని సబ్బవరం నుంచి ఒడిశా బయలుదేరారు. సుందరపేట జాతీయ రహదారి వద్దకు చేరుకునే సరికి అప్పటికే టైర్ పగిలి రహదారిపై నిలిచిపోయిన లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో డ్రైవర్ నూకరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. రాము తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం నూకరాజు మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి, తీవ్ర గాయాల పాలైన రామును విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతుడు నూకరాజుకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని సోదరుడు గంద్రేడి వెంకినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సూర్యకుమారి తెలిపారు.